## క్లుప్తంగా

### 1న నృసింహునికి చందనాలంకరణ



పెంచలకోన క్షేత్రం

రాపూరు: మండలంలోని పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామికి మార్చి 1వ తేదీన చందనాలంకరణ చేయనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా ఉదయం 4 గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడ సేవ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### జోరుగా ప్రవహిస్తున్న కైవల్యా నది



సైదాపురం: వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సహకారంతో కండలేరు నుంచి తెలుగు గంగ జలాలు విడుదలయ్యాయి. దీంతో కైవల్యా నదిలో ప్రవాహం పెరిగింది. సైదాపురం సమీపంలో కైవల్యానది ఉధృతంగా ప్రవహిస్తోంది. సైదాపురం, వేములచేడు, గంగదేవిపల్లి, అనంతమడుగు, పాలూరు, రామసాగరం, నల్లబొట్లపల్లి, పాతాళపల్లి, చీకవోలు తదితర గ్రామాల్లోని రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

### ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. గూడూరు పట్టణం, పరిసర గ్రామాలకు చెందిన పలువురు ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఏ వో కృష్ణ మాట్లాడుతూ చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ గౌరీ శంకర్ తన తల్లిదండ్రుల పేరు మీద ట్రస్టును ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెళ్లకూరులో కల్యాణ మండపం ఏర్పాటు చేసి పేదవారి పెళ్లిళ్లకు ఉచితంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

### పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం, గున్నం సేవా ట్రస్ట్ సహకారంతో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రామలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

### వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు అందజేస్తున్న వెంకటేశ్వర బాబు దంపతులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని మేరి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెని సూళ్లూరుపేట బ్రాంచి అసిస్టెంట్ మేనేజర్ వెంకటేశ్వర బాబు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. తన తల్లి స్వరాజ్యలక్ష్మీ జ్ఞాపకార్థం వృద్ధులకు చేయూత ఇచ్చినట్టు పేర్కొన్నారు. దిండ్లు, టవళ్లు, పండ్లు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు సునిత, బెన్ని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మంలో కేశ్యామల, వారి కుమార్తె హారిక పాల్గొన్నారు.

### కండలేరులో 10.399 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 10.399 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 480 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 260 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

# సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం





మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ పనిచేయాలి
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపు
- వెంకటగిరి రూరల్ నేతలతో సమావేశం

వెంకటగిరి రూరల్ : పేదల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మొగ్గళ్లగుంట గ్రామంలో వెంకటగిరి రూరల్ మండలంలోని 20 పంచాయతీల వైఎస్సార్ సీపీ నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నాయా లేదా అని తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి గపడ గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రజల ఇళ్ల వద్దకే పంపించి వారి యోగ క్షేమాలు తెలుసుకుంటున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. ప్రజలకు మంచి జరిగి ఉంటేనే తనను మళ్లీ ఆశీర్వదించాలని చెప్పిన వ్యక్తి జగనన్న తప్ప ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రీ లేరని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ వెంకటగిరి నియోజకవర్గంలో అందరి సహకారంతో 72 వేల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యామని చెప్పారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. తమ తల్లిదండ్రులు మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి రాజ్యలక్ష్మమ్మ వెంకటగిరిలో చేసిన అభివృద్ధిని గుర్తించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని ఆదరించాలని కోరారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందని, పార్టీ అండగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎం వెంకటేశ్వర్లు, నేతలు సదారెడ్డి, యాతలూరు సుబ్బరాయులు, కంచి కురుప్రసాద్, ఈరి పెంచలయ్య, మాజీ సర్పంచ్ తిరుమల, రవిరెడ్డి, రూరల్ మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

## కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం



యాగ మండపంలో పూజలు చేస్తున్న వేద పండితులు

చిల్లకూరు : మండలంలోని తూర్పుకనుపూరులోని పురాతన కామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ముత్యాలమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ కుటుంబం జీర్ణోద్ధరణ చేపట్టారు. ఈ క్రమంలో ఈ ఆలయం కుంభాబిషేకం పూజా కార్యక్రమాలను నాలుగు రోజుల పాటు చేపట్టి ఈ నెల 29న శిలాప్రతిష్ట చేయనున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఆలయ ఆవరణలో యాగశాలను ఏర్పాటు చేసి దేవతా మండప ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. చతుర్వేద పారాయణం చేశారు. వేద పండితుల మత్రోచ్చరణల మధ్య హోమం చేశారు. ఆలయ నిర్మాణ దాతలు సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈవో నవీన్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకి రామిరెడ్డి, ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీలోనే కాపులకు న్యాయం



మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం

కలువాయి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కాపులకు న్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ, ఆ పార్టీ నాయకుడు మాదాసు గంగాధరం తెలిపారు. ఆయన ఆదివారం కలువాయి మండలం కుల్లూరులో విలేకరులతో మాట్లాడారు. కొందరు కాపు, బలిజ సంఘం నాయకులు తమకు అన్యాయం జరుగుతోందని చెబుతున్న మాటలు అర్థరహితమన్నారు. పవన్ కళ్యాణ్ ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నారో అందరికీ తెలుసన్నారు. జనసేనలో ఉన్న ఏడునెలల్లో తాను ఎంత మానసిక క్షోభను అనుభవించానో తనకు మాత్రమే తెలుసని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు, ఒంగోలు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక విషయంలో కాపులకు అన్యాయం జరుగుతోందని కొందరు ఆరోపిస్తున్నారని, తాను ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు.

## ముగిసిన కబడ్డీ పోటీలు



క్రీడాకారులతో పరిశ్రమ ప్రతినిధులు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో రెండు రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. తమ్మినపట్నం పంచాయతీలోని జిందాల్ (సింహపురి) పవర్ లిమిటెడ్ ఆద్వర్యంలో జిందాల్ మెమోరియల్ ఇంటర్ మండల్ కబడ్డీ టోర్నమెంట్‌ను సెట్విన్, యువజన క్రీడా సర్వీసుల శాఖ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ పోటీల్లో 17 జట్లు పాల్గొన్నాయి. గమ్మళ్లదిబ్బకు చెందిన యంగ్ బుల్లెట్స్ జట్టు విజేతగా నిలిచి ఆల్ రౌండ్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. విజేతలకు సెట్విన్ సీఈవో మురళీకృష్ణ బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.20 వేల నగదు, షీల్డ్ అందజేశారు. రన్నరప్‌లుగా నిలిచిన రెండు జట్లకు రూ.15 వేలు, రూ.10 వేలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలోని యువకులను క్రీడల్లో ప్రోత్సహించేలా పరిశ్రమలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఇటీవల ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నెల్లిపూడి సుబ్రమణ్యం, పరిశ్రమ ప్రతినిధులు కే శ్రీనివాసరావు, అదానీ ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్ తదితరులు పాల్గొన్నారు.

## వరికోత యంత్రం చోరీపై కేసు నమోదు

చిల్లకూరు(చిట్టమూరు) : వరికోతలు కోసే యంత్రం చోరీకి గురైంది. బాధితుడు ఆదివారం చిట్టమూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామానికి చెందిన చిట్టమూరు వంశీమోహన్ వరికోత యంత్రాన్ని బాడుగకు తిప్పుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో చిట్టమూరు మండలం గునపాడు–కురుగొండ గ్రామాల మధ్య ఉన్న పొలాల్లో వరి కోతల కోసం పంపించాడు. శనివారం రాత్రి పనులు చేసిన అనంతరం యంత్రాన్ని పొలాల్లోనే వదిలి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూసే సరికి యంత్రం కనిపించలేదు. చుట్టుపక్కల రైతులను విచారించినా ఫలితం లేకపోవడంతో యంత్రం చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చినబలరామయ్య తెలిపారు.

## శాస్త్రోక్తంగా దోపోత్సవం



ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఘనంగా దోపోత్సవం జరిగింది. మొదట స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అలంకార మండపంలో పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేశారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఉత్సవమూర్తులు ఆలయానికి చేరుకున్న అనంతరం దోపోత్సవాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద ఆదివారం బైక్ అదుపుతప్పి ఇద్దరు గాయపడ్డారు. సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం మేరకు.. వెంకటగిరికి చెందిన రవి(37), సత్యరాజ్(25) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వస్తున్నారు. ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద ముందువెళుతున్న లారీని అధిగమించబోయి అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు వలంటీర్లకు వందనం

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.రామచంద్ర తెలిపారు. ఇందులో భాగంగా వలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. వలంటీర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

### ఐదు దుకాణాల్లో చోరీ

కోట : కోట బజారువీధిలో శనివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పలు దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఐదు దుకాణాల తలుపులు పగులగొట్టి నగదును తస్కరించారు. సంజయ్ అనే పండ్ల వ్యాపారి దుకాణం తలుపులను ఇనుప రాడ్లతో తెరిచి బీరువాలో ఉంచిన రూ.70 వేలు నగదును చోరీ చేశారు. ముందుగా దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తొలగించి చోరీకి పాల్పడినట్టు బాధితుడు తెలిపారు. సీసీ కెమెరా, వైర్లను సమీపంలో ఉన్న ముళ్ల పొదల్లో పడేసి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. మరో నాలుగు దుకాణాల్లో రూ.5 వేల వరకు నగదును దొంగలు చోరీ చేసినట్టు బాధితులు తెలిపారు. ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది. సమీపంలో ఉన్న సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో షబేబరాత్ ప్రార్థనలు

నాయుడుపేట టౌన్ : ముస్లింలు తమ పెద్దలను స్మరించుకుంటూ షబేబరాత్ (నమాజు) ప్రార్థనలను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని జామియా మసీదులో ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ముస్లింలు ప్రత్యేక నమాజు చేస్తూ జాగారం చేశారు. అలాగే అమీర్‌షావలీ మసీదు, పాతబస్టాండు వద్ద ఉన్న నూర్ మసీదు, అమరాగార్డెన్ వీధిలో మక్కా మసీదు, మునిరత్నం నగర్, ఎల్ఏ సాగరం పాత, కొత్త బీడికాలనీలు, పొగగొట్టం కాలనీల వద్ద ఉన్న మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శ్మశానవాటికల వద్ద పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. ఇంటి వద్ద పెద్దలను స్మరించుకుంటూ వారికి ఇష్టమైన ఆహార పదార్థాలు పెట్టి ఫాతేహాలు నిర్వహించి పలువురికి పంచి పెట్టారు.

### నేడు ఆసరా చెక్కుల పంపిణీ

గూడూరు రూరల్ : వైఎస్సార్ ఆసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పొదుపు సంఘాల సభ్యులకు ఆసరా చెక్కుల పంపిణీ చేస్తామని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ తెలిపారు. ఇందులో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అనుబంధ విభాగాల సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిల్లకూరు( చిట్టమూరు) : చిట్టమూరు మండలం రావిగుంటపాళెం సమీపంలోని బ్రిడ్జి వద్ద మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం వేకువజామున మృతి చెందినట్లు ఎస్ఐ చిన బలరామయ్య తెలిపారు. వాకాడు మండలం చెంబేటివారిపాళెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(32) బైక్‌లో చిట్టమూరు వెళుతుండగా రావిగుంటపాళెం సమీపంలోని బ్రిడ్జి వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు నాయుడుపేట ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

### ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు : తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పౌర్ణమి రోజున అమ్మవారికి చండీయాగం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయడం విశేషం. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. నూతనంగా వివాహం జరిగిన దంపతులు ఆలయంలోని రావి చెట్టు వద్ద ఊయల కట్టి సంతానం కోసం వరపద్దారు. ఈవో నవీన్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు దువ్వూరు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## నేడు 17 రైల్వే సబ్‌వే బ్రిడ్జిల ప్రారంభం



డీవీ సత్రం సబ్‌వే బ్రిడ్జి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

దొరవారిసత్రం : రైల్వే చెన్నై సబ్ డివిజన్ పరిధిలోని సూళ్లూరుపేట నుంచి ఓడూరు వరకు రైలు పట్టాలు దాటే ప్రాంతాల్లో 17 సబ్‌వే బ్రిడ్జిలు నిర్మించారు. వాటిని సోమవారం ప్రధాని నరేంద్రమోదీ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. దొరవారిసత్రంలోని రైల్వే లైన్ సబ్‌వే బ్రిడ్జి వద్ద చేపట్టిన ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లను ఆదివారం డీఆర్ఎం విశ్వనాథ్, ఏడీఆర్ఎం తేజ్‌ప్రతాప్‌సింగ్, ఏడీఈఈ చెల్లప్పన్ తదితరులు పరిశీలించారు. సూళ్లూరుపేట మండలం కోటపోలూరు, డీవీ సత్రం మండలంలోని పోలిరెడ్డిపాళెం, చందనముడి, నేతాజీనగర్, అక్కరపాక, డీవీ సత్రం, నెలబల్లి, నాయుడుపేట మండలం బిరదవాడ, చంద్రబాబునాయుడు కాలనీ తదితర ప్రాంతాల్లో సబ్‌వే బ్రిడ్జీలు నిర్మించారు. సూపరింటెండెంట్ జాయ్, కమర్షియల్ ఆఫీసర్ శేషయ్య, జేఈ కౌషిక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గ్రూప్–2 పరీక్షలు



డీఆర్‌డబ్ల్యూ పరీక్షా కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ, తహసీల్దార్



నారాయణ ఇంజినీరింగ్ కళాశాల వద్ద పరీక్షలు రాసేందుకు క్యూలో వెళుతున్న అభ్యర్థులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆర్డీవో ఎం.కిరణ్‌కుమార్, సెట్నల్ సీఈవోలు రూట్ ఆఫీసర్‌లుగా వ్యవహరించారు. ఆర్డీవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో 1,245 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద చీఫ్ సూపరింటెండెంట్, లైజనింగ్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్‌ను నియమించి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలోని ఎస్.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ, డీఆర్‌డబ్ల్యూ, నారాయణ జూనియర్ కళాశాల, ఆదిశంకర, నారాయణ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అధికారులు అభ్యర్థుల గుర్తింపు కార్డులు, హాల్ టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోనికి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను తహసీల్దార్ కరుణ్‌కుమార్, పోలీసు అధికారులు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణ ఇంజినీరింగ్ కళాశాల వద్ద పరీక్షలు రాసేందుకు వచ్చిన అభ్యర్థుల సెల్‌ఫోన్లను భద్రపరిచేందుకు కళాశాల సిబ్బంది మెయింటినెన్స్ చార్జ్ కింద నగదు వసూలు చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అక్కడికి చేరుకుని నగదు వసూలు చేయరాదని, అలా వసూలు చేస్తే చర్యలు తప్పవని కళాశాల సిబ్బందిని హెచ్చరించారు. దీంతో కళాశాల సిబ్బంది నగదు వసూలును నిలిపివేశారు.

## డబ్బున్నోళ్లకే టీడీపీలో సీటు



మాట్లాడుతున్న రావి దేవికా చౌదరి

దక్కిలి (బాలాయపల్లి): టీడీపీలో డబ్బు ఉన్న వారికే సీట్లు ఇస్తున్నారని, ఈ విషయం ప్రజలకు తెలుసని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి రావి దేవికా చౌదరి పేర్కొన్నారు. ఆమె ఆదివారం బాలాయపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు దళితులు, కాపులకు తీవ్ర అన్యాయం చేశారని దుయ్యబట్టారు. 20 మంది దళితులకు సీట్లు ఇచ్చానని గొప్పగా చంద్రబాబు చెబుతున్నారని, రిజర్వేషన్ కలిగిన స్థానాలను వారికే కేటాయించాలని తెలిపారు. వైఎస్సార్ సీపీలోనే కాపులకు న్యాయం జరిగిందన్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపేందుకు కాపులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు మహిళలకు అన్ని రంగాల్లోనూ పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజారిటీ గెలుపొందడం ఖాయమని, మళ్లీ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

## రోజు రోజుకూ పెరుగుతున్న నిమ్మ ధరలు



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న రైతు, కూలీ



పురుగు మందు పిచికారీ చేస్తున్న మహిళా రైతు

సైదాపురం: నిమ్మకాయల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో నిమ్మకాయల ధర రూ.65 నుంచి రూ.85 వరకు పలుకుతున్నాయి. నాణ్యత కలిగిన కాయలు రూ.85 వస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. సైదాపురం మండలంలో ఎక్కువ మంది రైతులు నిమ్మ తోటలను సాగు చేశారు. గత ఏడాదితో పాటు ఈసారి కూడా ఏప్రిల్, మే నెలల్లో కాయల దిగుబడి ఆశించిన స్థాయిలో ఉంది. ధరలు కూడా పెరుగుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తునఆనరు. సకాలంలో వర్షాలు కురుస్తుండడం, ప్రభుత్వం పంటల సాగుకు సాయం అందిస్తుండడంతో ఇబ్బందులు లేకుండా వ్యవసాయం చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు.

## సైకిల్ యాత్ర చేస్తున్న దంపతులకు ఘన సత్కారం



సైకిల్ యాత్ర చేపట్టిన దంపతులను సత్కరిస్తున్న నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రతినిధులు

నాయుడుపేట టౌన్ : పోలియోను నిర్మూలించాలని, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సందేశంతో చెన్నై నుంచి ముంబయికి సతీష్‌కుమా ర్, శంకరి జ్ఞానాక్షి దంపతులు సైకిల్ యాత్ర చేపట్టారు. వారు ఆదివారం నాయుడుపేటకు చేరుకున్నారు. వారికి రోటరీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యో గుల సంఘం కార్యాలయంలో సత్కరించారు. ప్రజలకు మంచి సందేశాన్ని ఇస్తూ సైకిల్‌పై యాత్ర చేస్తున్న ఇద్దరినీ అభినందించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి రామమోహన్, కృష్ణారావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉదయ్ శంకర్, బి.సుబ్రమ ణ్యం యాదవ్, శంకర్ లాల్, నాగరాజు, అమ్మ ఫౌండేషన్‌కు చెందిన కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం



అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తితో రైల్వే పోలీసులు

గూడూరు రూరల్ : గూడూరులోని రైల్వే స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని రైల్వే పోలీసులు ఆదివారం వేకువజామున పట్టుకున్నారు. నెల్లూరు రైల్వే సీఐ భుజంగరావు ఆదేశాల మేరకు పోలీసులు రైళ్లలో తనిఖీలు చేపట్టారు. గూడూరు ఒకటో ప్లాట్ ఫారం చివర అనుమానాస్పందంగా ఉన్న వ్యక్తి వద్ద పరిశీలించగా కర్ణాటక మద్యం బాటిళ్లు ఉన్నాయి. అతన్ని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను టీపీ గూడూరుకు చెందిన గుడాల నాగేంద్రగా తేలింది. అతని వద్ద ఉన్న కర్ణాటక మద్యం బాటిళ్లు 48ని స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌పీఎస్ఐ కొండపనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.